క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


గౌతమ్


జిత్యా

పెద్దపంజాణి: మండలంలోని శంకర్రాయలపేట జెడ్పీ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి గౌతమ్ అండర్–17 బాలుర కబడ్డీ జట్టుకు, 9వ తరగతి విద్యార్థి జిత్యా అండర్–14 హైజంప్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం అశ్వర్థనారాయణరావు శుక్రవారం తెలిపారు. విద్యార్థులను పీడీ దొరై, పీఎంసీ చైర్మన్ శ్రీరాములరెడ్డి, సర్పంచ్ హరినాథ్ అభినందించారు.

గోవిందరెడ్డి కుటుంబానికి సంతాపం

పెద్దపంజాణి: మండలంలోని అమ్మరాజుపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గోవిందరెడ్డి సోదరుడు వెంకటరమణారెడ్డి గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి, పుంగనూరు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి శుక్రవారం అమ్మరాజుపల్లెకు వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబాన్ని ఓదార్చి సంతాపం తెలియజేశారు.

వైఎస్సార్ బీమా పంపిణీ

రొంపిచెర్ల: శ్రీరాముల వడ్డిపల్లెలో సుధారాణికి వైఎస్సార్ బీమా కింద రూ.10వేలను తక్షణసాయంగా శుక్రవారం సర్పంచ్ సుధారాణి పంపిణీ చేశారు. సుధారాణి భర్త మల్లికార్జున అనారోగ్యంతో ఇటీవలే మృతి చెందారు. మిగిలిన రూ.90 వేలు నగదును బాధితురాలి బ్యాంక్ అకౌంట్‌లో జమ అవుతుందని సర్పంచ్ తెలిపారు. ఏపీఎం బ్రహ్మానందరెడ్డి, మాజీ సర్పంచ్ రామనారాయణ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సీవీరమణ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వెలుగు సీసీ మృతి


మునిరత్నం (ఫైల్)

పుంగనూరు: పెద్దపంజాణి మండలం వెలుగు సీసీ మునిరత్నం(42) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. మండలంలోని కుమ్మరగుంటకు చెందిన ఈయనకు భార్య, పిల్లలు ఉన్నారు. ఈయన మృతికి వెలుగు సిబ్బంది సంతాపం తెలిపారు. భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అలాగే పెద్దపంజాణి ఎంపీపీ రెడ్డెప్ప, ఏపీఎం కృష్ణప్ప గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబాన్ని ఓదార్చి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

కోడి పందేలు నిషేధం

రొంపిచెర్ల: సంక్రాంతి వేడుకల్లో జల్లికట్టు, కోడి పందెలను ప్రభుత్వం నిషేధించిందని ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా జల్లికట్టు లేదా కోడి పందెలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎక్కడైనా ఇలాంటివి జరుగుతుంటే ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

రేషన్ కార్డుల పంపిణీ



పులిచెర్ల(కల్లూరు): మండలంలోని దిగువపోకల వారిపల్లె సచివాలయంలో శుక్రవారం కొత్తగా మంజూరైన రేషన్‌కార్డులను లబ్ధిదారులకు స్థానిక ఎంపీటీసీ సభ్యుడు పోకల చంద్ర అందజేశారు. పంచాయతీలో కొత్తగా 9మందికి రేషన్ కార్డులు మంజూరు అయ్యాయి. సర్పంచ్ పోకల ఉమాదేవి, నాయకులు శ్రీనివాసులు, గంగయ్య, దామోదర్‌రెడ్డి, శ్రీధర్, చెంగల్‌రాయులు, వీఆర్వో శ్రీనివాస్, కార్యదర్శి సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన రమణ శుక్రవారం రూ.లక్ష విరాళం ఇచ్చారు. మధ్యాహ్నం ఆయన స్వామివారి దర్శనార్థం కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేశారు. ఏఈఓ విద్యాసాగర్ రెడ్డిని కలసి రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు ప్రత్యేక దర్శనం కల్పించారు.

వేతనాలు ఇవ్వాలి

చిత్తూరు అర్బన్: మున్సిపల్ కార్పొరేషన్‌లో క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) ఏజెన్సీలో పనిచేస్తున్న ఆటో డ్రైవర్ల వేతనాలు ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగరాజు కోరారు. శుక్రవారం కార్మికులతో కలిసి కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో నిరసన తెలిపారు. ఏఐటీయూసీ నాయకులు గోపినాథ్, మణి, సత్యమూర్తి, అజీమ్‌బాషా, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి వచ్చింది..సంబరాలు తెచ్చింది

పలమనేరు: సంక్రాంతి పండగను పురస్కరించుకొని పట్టణానికి చెందిన వాసవి వనిత క్లబ్ నిర్వాహకులు శుక్రవారం వాసవి మాతకు ప్రత్యేక అలంకరణలు చేసి విజయం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కొత్త సంవత్సరంలో అందరికీ విజయం దక్కాలని దక్కాలని కోరుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షురాలు ఉష, కార్యదర్శి దీపిక తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యురాళ్ళు పాల్గొన్నారు.

పైపాళ్యం పీహెచ్‌సీలో..

కుప్పం రూరల్: మండలంలోని పైపాళ్యం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సిబ్బంది శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఆస్పత్రి ఆవరణను మామిడి తోరణాలు, చెరుకు గడలతో అలంకరించారు. రంగవల్లులు తీర్చిదిద్దారు. పొంగళ్లు వండి సూర్యభగవానుడికి నివేదించారు. వైద్యాధికారులు సందీప్, జశ్వంత్, ఎంపీహెచ్‌వో బాలాజీ, సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


వేడుకల్లో పాల్గొన్న పైపాళ్యం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది

క్రికెట్ పోటీలు ప్రారంభం

బైరెడ్డిపల్లె: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలంలోని గొల్లచీమనపల్లెలో యువత ఆధ్వర్యంలో శుక్రవారం 3రోజుల క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మునస్వామిరెడ్డి, లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు కాకర్ల పురుషోత్తంనాయుడు పోటీలను ప్రారంభించారు. గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో ఆడాలని తెలిపారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.30వేలు, రెండవ బహుమతిగా రూ.20వేలు, మూడవ బహుమతిగా రూ.10వేలు, నాల్గవ బహుమతిగా రూ.6 వేలు అందజేయనున్నట్లు తెలిపారు.


పలమనేరు: విజయం కార్యక్రమంలో పాల్గొన్న వాసవీ క్లబ్ సభ్యులు


బైరెడ్డిపల్లె: పోటీలను ప్రారంభిస్తున్న మునస్వామిరెడ్డి, పురుషోత్తంనాయుడు

జగనన్న కాలనీ ఏర్పాటు పనులు ప్రారంభం

శాంతిపురం: మండలంలోని 30 సొన్నేగానిపల్లె పంచాయతీ కూతేగౌనిపల్లె వద్ద జగనన్న కాలనీ కోసం ఎంపిక చేసిన ప్రదేశంలో శుక్రవారం రెవెన్యూ అధికారులు పనులు ప్రారంభించారు. పిచ్చిమొక్కలు, పొదలను తొలగించి లే ఔట్ వేసేందుకు చర్యలు తీసుకున్నారు. గతంలో అధికారులు ప్రభుత్వ భూమిగా గుర్తించి ఇక్కడ కాలనీ ఏర్పాటు పనులను ప్రారంభించారు. అయితే కొందరు వ్యక్తులు ఈ భూమి తమదిగా పేర్కొంటూ కోర్టును ఆశ్రయించారు. దీనిపై కోర్టు స్టేను తొలగించడంతో తహసీల్దార్ లోకేశ్వరరావు ఆధ్వర్యంలో మళ్లీ కాలనీ పనులను ప్రారంభించినట్లు జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు తెలిపారు. సొంత ఇళ్లు, ఇంటి స్థలం లేని 40 మంది లబ్ధిదారులకు ఇక్కడ స్థలాలు కేటాయిస్తామని ఆయన చెప్పారు.


జేసీబీతో పిచ్చిమొక్కల తొలగింపు

శ్రీవిరూపాక్షి మారెమ్మకు ప్రత్యేక పూజలు


పప్పు దినుసుల విశేష అలంకారంలో అమ్మవారు

పుంగనూరు: పట్టణంలోని శ్రీవిరూపాక్షి మారెమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే చలిని సైతం లెక్కచేయకుండా భక్తులు అధిక సంఖ్యలో హాజరై, చలిపిండి, చల్లముద్దతో దీపాలు వెలిగించి, మొక్కులు చెల్లించారు. ఉదయం 10–30 నుంచి 12 గంటల వరకు రాహుకాల సమయంలో విశేష పూజలు జరిగాయి. అమ్మవారిని ప్రత్యేకంగా పప్పు దినుసులు పరిమళ భరిత పుష్పమాలికలతో అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన

వి.కోట: గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు సర్పంచ్ పీఎస్.లక్ష్మి, పంచాయతీ ఈఓ యాదవపతి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని స్కూల్ వీధి, బ్రాహ్మణవీధి, మసీదువీధి, ,ఈశ్వర్‌నగర్, బంగ్లా చేను, దాసార్లపల్లె, గాండ్లపల్లెలో నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్ల పనులను ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా వి.కోట పంచాయతీలో అభివద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.



సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

బైరెడ్డిపల్లె: సీజనల్ వ్యాధులపై గ్రామీణులను అప్రమత్తం చేయాలని ఆరోగ్యసిబ్బందికి డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌ఓ హరినాథరెడ్డి సూచించారు. మండలంలోని తీర్థం పీహెచ్‌సీ పరిధిలోని దేవదొడ్డిలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజిషియన్ ప్రోగ్రాంను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. ఉదయం 9 గంటలకే ఓపీ సేవలను ప్రారంభించాలని తెలిపారు. మధ్యాహ్నం పైన ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ చేసుకున్న వారి ఇంటి వద్దకెళ్లి ఆరోగ్య సమస్యలపై ఆరా తీయాలన్నారు. వైద్యాధికారులు అరుణ్‌కుమార్, పద్మావతి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీదేవి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


సూచనలిస్తున్న హరినాథరెడ్డి

కల్లూరు పాఠశాలలో అపూర్వ కలయిక


ఆత్మీయ సమ్మేళనంలో 1989-90 బ్యాచ్ విద్యార్థులు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని కల్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1989–90 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు పాఠశాలలో శుక్రవారం ఒక్కటయ్యారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. పాఠశాలలో మహాత్మా గాంధీ విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వైకల్యంతో ఉన్న సహచర మిత్రుడు రామస్వామికి పుర్రారెడ్డెప్ప ఆర్థిక సాయం అందజేశారు. విశ్రాంత ఉపాధ్యాయుడు నారాయణస్వామి దంపతులను సత్కరించారు. హెచ్ఎం తాతయ్య, పూర్వ విద్యార్థులు అలీం, ప్రతాప్‌రెడ్డి, శేషగిరి, షణ్ముగ, దామోదర్, మస్తాన్, రమేష్, కిషోర్, ధరణి కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీకి తుది గడువు రేపే

సోమల: పీఎం కిసాన్ 13 విడత నగదు ఖాతాల్లో జమ కావాలంటే ఈనెల 15 లోపు రైతులందరూ ఈకేవైసీ తప్పకుండా చేసుకోవాలని వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ వెంకటేష్ తెలిపారు. శుక్రవారం ఆర్బీకేలో సలహా మండలి సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై అధికారులు అవగాహన కల్పించాలని తెలిపారు. ఎంపీపీ ఈశ్వరయ్య, ఎంపీడీఓ నాగరాజ, వైఎస్సార్‌సీపీ నాయకులు అమాస మోహన్, నాగేశ్వరరావు, ప్రభాకర, ఏఓ సుధాకర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్బీకే చైర్మన్ వెంకటేష్

అభివృద్ధి పనుల పరిశీలన

పలమనేరు: పలమనేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను మార్కెటింగ్‌శాఖ ఏడీ పరమేశ్వరన్, డీఈ హరినాథ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. మార్కెట్ కమిటీలోని వివిధ విభాగాలను, క్యాటిల్‌ఫామ్ వద్ద నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ టమాటా మార్కెట్ పనులను పరిశీలించారు. అలాగే వీకోట మండలంలోని శివునికుప్పం వద్ద ఏర్పాటు చేయనున్న మామిడికాయల మార్కెట్ ఏర్పాటు స్థలాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఆంజినేయులు, ఎమ్మార్ వేణు, కార్యదర్శి సంజీవకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


శివునికుప్పం వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పుంగనూరుకు వచ్చి బాబు చేసేదేమి లేదు


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, పెద్దిరెడ్డి

- పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి భారీ మెజారిటీ ఖాయం
- ప్రణాళికాబద్ధంగానే టీడీపీ దాడులు
- మా కార్యకర్తల జోలికి వస్తే చూస్తూ ఊరుకోం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి ధ్వజం

సదుం: పుంగనూరుకు వచ్చి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సంగతి చూస్తానంటూ మాజీ సీఎం చంద్రబాబు ప్రగల్భాలు పలుకుతున్నారని, ఆయన వచ్చి చేసేది ఏమీ లేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తెలిపారు. స్థానిక పీఎల్ఆర్ భవనంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో పుంగనూరులో ఎవరు నిలబడ్డా రామచంద్రారెడ్డికి 70 వేల మెజారిటీ సాధించడం ఖాయమన్నారు. టీడీపీ అభ్యర్థి ఘోరంగా ఓడిపోకపోతే తామంతా రాజకీయ సన్యాసం తీసుకుంటామని సవాలు చేశారు. చంద్రబాబు సమావేశాల్లో తాను గెలిస్తే ఏమి చేస్తానో చెప్పకుండా, మంత్రిపై ఆరోపణలు చేయడానికే చంద్రబాబుకు సమయం సరిపోతోందన్నారు. శివశక్తి డెయిరీపై ఆయన అవాస్తవాలను ప్రచారం చేయడం మానుకోవాలన్నారు. తన డెయిరీ స్థాపించడానికి చిత్తూరు కోఆపరేటివ్ డెయిరీని మూసివేసి, వేలాది రైతులు కడుపుకొట్టిన విషయం జిల్లా ప్రజలందరికీ తెలుసని పేర్కొన్నారు. తాము స్థానికంగానే పాలు సేకరిస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా పాడి రైతులను దోచుకుంటున్న చంద్రబాబు డెయిరీపై టీడీపీ దద్దమ్మలు నోరు మెదపాలని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నల్లారి, చల్లా ఎమ్మెల్యేలు కూడా కాలేరు

టీ డీపీ నేతలు నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, చల్లా బాబు జీవితంలో ఎమ్మెల్యేలు కూడా కాలేరని పెద్దిరెడ్డి స్పష్టం చేశారు. అన్ని పార్టీల్లో అన్ని కులాలు, మతాలు ఉంటాయని, టీడీపీ నేతలు దాడుల్లో అరెస్టు అయితే కులాల వారీగా రెచ్చగొట్టి మేలు పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. గతంలో పుంగనూరు నియోజకవర్గంపై కక్షతో అభివృద్ధిని అడ్డుకుంటే, ఇప్పుడు రాష్ట్రంలోనే మంత్రి చొరవతో అభివృద్ధిలో మొదటిస్థానంలో ఉందని చెప్పారు. కిరణ్‌కుమార్‌రెడ్డి ఓ ఫెల్యూర్ ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచారని, తమ్ముడు కిశోర్ ఆయనకు వెన్నుపోటు పొడిచి టీడీపీలో చేరారని తెలిపారు. అన్న సీఎంగా ఉన్నప్పుడు సైతం వందలాది బలగాలతో నియోజకవర్గంలో పర్యటించి భయభ్రాంతులకు గురిచేశారని తెలిపారు. తమను ప్రజలు విశ్వసించక పోవడంతో ప్రశాంతంగా ఉన్న పుంగనూరు నియోజకవర్గాన్ని తమ మేలు కోసం, ప్రాభవం కోసం టీడీపీ నాయకులు ఇదేమి ఖర్మతో అలజడులు సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. సోమల, రొంపిచెర్లలో ముందస్తు ప్రణాళికలతోనే వచ్చి రాళ్లు, బీరుబాటిళ్లు, హాకీ స్టిక్స్‌తో దాడులకు తెగబడ్డారని చెప్పారు. ఇకపై తమ కార్యకర్తల జోలికి వస్తే చూస్తూ ఊరుకోమని, తగు రీతిలో బుద్ధి చెపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్లప్ప, సింగిల్‌విండో వైస్ చైర్మన్ రమేష్ రెడ్డి, చిన్నరమణ, రాజశేఖర్, మోహన్‌రెడ్డి, అన్నారెడ్డి, ఎంఎం బాషా పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ


పలమనేరు: దుప్పట్ల పంపిణీ

పలమనేరు: మున్సిపల్ పరిధి 16వ వార్డు రాధాబంగ్లా ప్రాంతంలోని పేదలకు కౌన్సిలర్ శ్యామ్ సుందర్‌రాజు ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ హేమంత్‌కుమార్‌రెడ్డి శుక్రవారం దుప్పట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ చలికాలాన్ని దృష్టిలో ఉంచుకుని దుప్పట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ జావీద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.


పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: కోగిలేరు గ్రామ ఎస్టీలకు సర్పంచ్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో కలువల్లి చిన్నా మిత్ర బృందం శుక్రవారం దుప్పట్లు, మాస్కులు పంపిణీ చేసింది. సర్పంచ్ మాట్లాడుతూ భవిష్యత్తులోనూ సేవా కార్యక్రమాలు కొనసాగించాలని కోరారు.